సాక్షి నాగర్‌కర్నూల్
గురువారం । 23 । మే । 2024



కనులపండువగా..
జేమపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవం కనులపండువగా నిర్వహించారు.
వివరాలు 8లో ▸



క్రికెటర్లకు మహర్దశ
పిల్లలమర్రి సమీపంలోని క్రికెట్ మైదానంలో వసతులు అందుబాటులోకి వస్తున్నాయి.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం 40.7/23.7
వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం వేళలో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

30న కంటి వైద్యశిబిరం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 30న జిల్లా జనరల్ ఆస్పత్రిలో కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆప్తాలమిక్ ఆఫీసర్ బి.శివారెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. శిబిరంలో రక్త, సాధారణ, కరోనా పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కంటి శుక్లాల సమస్యతో బాధపడుతున్న వారిని ప్రత్యేక అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ లయన్ రాంరెడ్డి కంటి ఆస్పత్రికి తరలించి, ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ జిరాక్స్‌తో రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94404 54284, 81063 33324 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

25న జెడ్పీ సమావేశం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని ఎస్‌జేఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 25న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సీఈఓ దేవసహాయం బుధవారం ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి సభ్యులు, జిల్లా స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో హాజరుకావాలని కోరారు.

మైనార్టీ గురుకులంలో స్పాట్ అడ్మిషన్స్

కొల్లాపూర్: పట్టణంలోని మైనార్టీ గురుకుల కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీకిగాను స్పాట్ అడ్మిషన్స్ తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ స్వరూప బుధవారం ప్రకటనలో తెలిపారు. సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులలో సీట్లు ఉన్నాయని.. మైనార్టీ విద్యార్థినులకు 60, ఇతరులకు 20 సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు నేరుగా అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 79950 57922, 73825 32129 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేడు ఉమ్మడి జిల్లాస్థాయి సదస్సు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు వచ్చే వానాకాలం సీజన్‌లో అమలు చేయనున్న పంటల బీమా పథకంపై వ్యవసాయశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. కేంద్రం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో చేరడం, ప్రీమియం చెల్లింపు, బీమా పరిహారం తదితర వాటితోపాటు పొరుగు రాష్ట్రాల్లో పంటల బీమా పథకం ఎలా అమలవుతుందనే దానిపై అధ్యయనం చేస్తుంది. అందులో భాగంగానే గురువారం ఉదయం 11 గంటలకు మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్ అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ హాల్‌లో ఉమ్మడి పాలమూరులోని జిల్లాకు ఐదుగురు చొప్పున రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో పంటల బీమా పథకంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేష్ తెలిపారు. ఈ సదస్సులో రైతుల ద్వారా బీమా పథకం అమలు కోసం అభిప్రాయాలు సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నామని పేర్కొన్నారు.

సర్వేతో సరిపెట్టారు

- నిలిచిపోయిన జాతర కుంట రిజర్వాయర్ నిర్మాణ పనులు
- కరువుతో అల్లాడుతున్న రైతులు
- రిజర్వాయర్ నిర్మాణం చేపడితే అందుబాటులోకి సాగు, తాగునీరు

వివరాలు 9లో ▸ - పెద్దకొత్తపల్లి

కుట్టడమే తరువాయి..

జిల్లాకు చేరిన స్కూల్ యూనిఫాం క్లాత్



జిల్లా కేంద్రంలో నిల్వచేసిన యూనిఫాం క్లాత్

- మహిళా సంఘాలకు తయారీ బాధ్యత
- పాఠశాలల పునఃప్రారంభం నాటికి పూర్తయ్యేలా ప్రణాళిక
- జిల్లాలో 60,423 మంది విద్యార్థులు

నాగర్‌కర్నూల్: జిల్లా, మండల పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 2024 – 25 విద్యా సంవత్సరంలో అందించాల్సిన యూనిఫామ్స్‌ను వేసవిలోనే రెడీ చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. యూనిఫామ్స్‌కు సంబంధించిన క్లాత్ ఇప్పటికే జిల్లాకు చేరుకోగా.. స్వయం సహాయక మహిళా సంఘాల ఆధ్వర్యంలో దుస్తులు కుట్టించేందుకు విద్యాశాఖ, డీఆర్డీఓ అధికారులు కసరత్తు ప్రారంభించారు. గతానికి భిన్నంగా ఈఏడాది తరగతుల వారీగా విద్యార్థులకు వేర్వేరు నమూనాల్లో యూనిఫాం కుట్టేలా రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు మార్గదర్శకాలను జారీ చేశారు. తప్పనిసరిగా అదే మోడల్‌లో యూనిఫామ్స్ కుట్టించి, విద్యార్థులకు అందించాలని ఆదేశించారు.

➡ ఒకటి నుంచి మూడు తరగతుల బాలికలకు బాడీ ఫ్రాక్‌లు, షర్ట్‌లకు సంబంధించి కొలతలతో సహా నిర్దేశించిన రీతిలోనే ఉండాలనే షరతు విధించారు. నాలుగు, ఐదు తరగతుల వారికి కూడా స్కర్టులు, చొక్కాలకు రెండు జేబులు, భుజాలపై క్లాకులు, రెండు చేతులకు క్లిప్పులు ఉండాలని నిబంధన పెట్టారు. 6నుంచి 12 తరగతుల వారికి పంజాబీ డ్రెస్సులు కుట్టించి ఇవ్వాలని ఆదేశించారు. డ్రెస్సులకు హ్యాండ్ క్లిప్స్, కాలర్ నెక్ పట్టీ, డ్రెస్‌పై వాస్కోటు ఉండాలని సూచించారు. విద్యార్థులకు ప్యాంట్లు, నిక్కర్లు గతంలో మాదిరిగానే ఉండాలని సూచిస్తూ, జిల్లా అధికారులకు విధివిధానాలను జారీ చేశారు.

ఎంఈఓల పర్యవేక్షణలో..

జిల్లాలోని మహిళా సంఘాలకు స్కూల్ యూనిఫామ్స్ తయారీ బాధ్యతను అప్పగించనున్నారు. అందుకు ఆసక్తిగల మహిళా సంఘాల నుంచి టెండర్లను ఆహ్వానించి, ఖరారు చేయాల్సి ఉందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. డీఆర్డీఓ అధికారుల సహకారంతో మండలాల వారీగా యూనిఫామ్స్ స్టిచ్చింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించి.. ఎంఈఓల పర్యవేక్షణలో సిద్ధం చేయించనున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు యూనిఫామ్స్ కుట్టించి, విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు.

తొలిరోజే పంపిణీకి చర్యలు..



పాఠశాలల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. మహిళా సంఘాలతో ప్రత్యేకంగా చర్చించి, యూనిఫామ్స్ కుట్టు బాధ్యతలను అప్పగిస్తున్నాం. మొదట విద్యార్థులకు ఒక జత చొప్పున దుస్తులు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.
– ఎం.గోవిందరాజులు, డీఈఓ

పాఠశాలల వారీగా ఇలా..

జిల్లాలో ప్రస్తుతం 1నుంచి 8 తరగతుల వరకు 46,529 మంది విద్యార్థులు కేజీబీవీ, మోడల్, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. వారిలో బాలురు 22,796, బాలికలు 23,733 మంది ఉన్నారు. 9, 10 తరగతుల్లో మొత్తం 12,418 మందికిగాను 6,213, మంది బాలురు, 6,205 మంది బాలికలు ఉన్నారు. కేజీబీవీ, మోడల్ స్కూల్లో 11 నుంచి 12వ తరగతి వరకు 1,476 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారిలో 99మంది బాలురు, 1377మంది బాలికలు ఉన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తెలకపల్లి/తాడూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ట్రైనీ ఏఎస్ఓల బృందం సూచించింది. బుధవారం తెలకపల్లిలోని పలు శాఖల కార్యాలయాలను సందర్శించి.. పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను తెలుసుకున్నారు. మండల మహిళా సమాఖ్యలో ఏపీఎం నిరంజన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ ఇతర అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. పశువైద్యశాలలో మూగ జీవాలకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. కొలతల ప్రకారం ఉపాధి పనులు చేసి, నిర్ణీత కూలి డబ్బు పొందాలని సూచించారు. అనంతరం మిషన్ కాకతీయ పథకం కింద చేపట్టిన చెరువుల పునరుద్ధరణ పనులను చూశారు. అదనపు కలెక్టర్ శ్రీకుమార్ దీపక్, ఎంపీడీఓ కృష్ణయ్య ఉన్నారు.

⇨ తాడూరు మండలంలోని అల్లాపూర్‌లో కేంద్ర ట్రైనీ ఏఎస్ఓల బృందం రెండో రోజు కొనసాగింది.



అల్లాపూర్‌లో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఏఎస్ఓల బృందం

టీం సభ్యులు ఆదిత్య స్వరూప్, దీపక్, ఉజ్వల్ సంఘం, ప్రమీజ్‌కుమార్ వర్మ ఉపాధి కూలీలతో వారు మమేకమై వారు పనులు ఏవిధంగా చేయాలనే దానిపై అవగాహన కల్పించారు. గ్రామానికి మంజూరైన ఉపాధి పనుల వివరాలతోపాటు కూలీల వివరాలను సేకరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను సూపర్‌వైజర్ వనజతో తెలుసుకున్నారు. ఏపీఓ చంద్రసిద్దార్థ, పంచాయతీ కార్యదర్శి వినోద్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభచాటాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రతిభచాటి పతకాలు సాధించాలని జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి శరత్‌చంద్ర అన్నారు. జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో బుధవారం జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. శరత్ చంద్ర క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. హన్మకొండలో వచ్చే నెల 6, 7 తేదీల్లో రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయని తెలిపారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఎంపికల వివరాలు..

ఎంపికలకు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో అండర్– 8 విభాగం బాల, బాలికలకు 50 మీ., 150 మీటర్ల పరుగు, అండర్–10కు 80 మీ., 300 మీ., లాంగ్‌జంప్, అండర్– 12 విభాగం 100 మీ., 400 మీ., లాంగ్‌జంప్, అండర్– 14, 16, 20 విభాగాలకు 100 మీ., 400 మీ., అండర్– 18 విభాగంకు 100 మీ., 200 మీ., 400 మీ., 800 మీ., 3000 మీ., 2000 మీటర్ల స్టిపుల్ చేజ్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, పురుషుల విభాగంలో 13 అంశాల్లో ఎంపికలు నిర్వహించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శరత్‌చంద్ర

కల్తీ విత్తనాలపై నిఘా

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలో కల్తీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. కల్తీ విత్తనాల కట్టడి కోసం 10 మంది అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ప్రత్యేక బృందం ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించడంతో పాటు విత్తనాల నాణ్యతను పరిశీలించనున్నట్లు తెలిపారు. రైతులకు ఎవరైనా కల్తీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీసీఎస్ సీఐ శంకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం పనిచేస్తుందని.. వంగూర్, తాడూరు, లింగాల ఎస్ఐలు మహేందర్, మహేష్, జగన్మోహన్ సభ్యులుగా ఉంటారని తెలిపారు.

25న ఉమ్మడి జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25న జిల్లాకేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లాస్థాయి బాల, బాలికల బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్‌గౌడ్, ఎల్.రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్– 13, 15, 17, 19 విభాగాల బాల, బాలికలు, సీనియర్ పురుషులు, మహిళలు, వెటరన్స్‌లో అండర్–35, 45, 55, 65 విభాగాల్లో ఎంపికలు ఉంటాయన్నారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఇండోర్ స్టేడియంలో ఉదయం 9 గంటలకు కార్య నిర్వాహక కార్యదర్శి సాదత్‌ఖాన్‌కు రిపోర్టు చేయాలని కోరారు. పూర్తి వివరాల కోసం సెల్ నంబర్లు 98480 85211, 98669 28835 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

స్పందన అంతంతే..



భూత్పూర్- మహబూబ్‌నగర్ మధ్య ఓ వెంచర్‌లో ఓపెన్ ప్లాట్లకు వేసిన హద్దురాళ్లు

ఉమ్మడి జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్‌కు భారీగా దరఖాస్తులు

- పరిష్కారంలో అధికారుల అలసత్వం
- ఫీజు చెల్లించడానికి ముందుకు రాని ప్రజలు
- ప్రస్తుతానికి ఆన్‌లైన్‌లో ప్లాట్ల వివరాలు

ఉమ్మడి జిల్లాలో మున్సిపాలిటీలు	ఎల్‌ఆర్‌ఎస్‌కు వచ్చిన దరఖాస్తులు
19	1,94,472
అధికారులు పరిశీలించినవి	క్రమబద్ధీకరణకు అనుమతి లభించినవి
31,577	436
ప్రభుత్వానికి సమకూరిన ఆదాయం : రూ.1,84,00,299	

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉమ్మడి జిల్లాలో అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణ పథకానికి (ఎల్‌ఆర్‌ఎస్) స్పందన నామమాత్రంగానే వచ్చింది. కాగా, 2020 సెప్టెంబర్‌లో స్వీకరించిన ఈ దరఖాస్తులను పరిష్కరించాలని కాంగ్రెస్ ప్రభుత్వం గత ఫిబ్రవరిలో ఆదేశించింది. అప్పట్లో ఓపెన్ ప్లాట్లను కొనుగోలు చేసిన వారు దరఖాస్తుతోపాటు రూ.వెయ్యి చొప్పున ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం పేరిట అదే నెల 15లోగా ఆయా మున్సిపాలిటీలకు చెల్లించారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని 19 మున్సిపాలిటీల్లో 1,94,472 మంది ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు 31,577 టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించారు. వీటిలో 241 తిరస్కరణకు గురి కాగా.. ఆయా శాఖల నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలు (ఎన్‌ఓసీ) తీసుకురావాలని 6,364 దరఖాస్తులను వెనక్కి ఇచ్చేశారు. ఇక 4,568కి సంబంధించి 14 శాతం ఫీజు చెల్లించాలని సూచించగా 129 మంది మాత్రమే చలానా కట్టారు. వీరి ద్వారా ప్రభుత్వానికి మొత్తం రూ.1,84,00,299 ఆదాయం సమకూరింది.

నిబంధనలు ఇలా..

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుదారులు తమ ప్లాట్లకు సంబంధించిన పూర్తి వివరాలను టౌన్ ప్లానింగ్ అధికారులకు అందజేయాలి. రిజిష్టర్ డాక్యుమెంట్ ప్రకారం మార్కెట్ విలువలో 14 శాతం చెల్లించాలి. ముఖ్యంగా ఖాళీ స్థలం చార్జీలతోపాటు లేఅవుట్ ఫీజు కట్టాల్సి ఉంటుంది. ఒకవేళ దరఖాస్తుదారుల ఫోన్ నంబరు మారితే ఆ వివరాలను సైతం ఆన్‌లైన్‌లో అప్పటికప్పుడు నమోదు చేస్తారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అన్నీ సరిగా ఉంటే వెంటనే ఆమోదిస్తారు. ఇదిలా ఉండగా.. అప్పట్లో లేఅవుట్ వేసిన డెవలపర్ (పార్ట్ ఆఫ్ లేఅవుట్) దరఖాస్తుతోపాటు రూ.10 వేల చొప్పున చెల్లించారు. వీరి దరఖాస్తుల పరిష్కారానికి ఇంకా ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు.

అక్కడ ఎవరూ ముందుకు రాలే..

కొత్తకోట మున్సిపాలిటీ పరిధిలో 7,539 రాగా, 212 పరిష్కారం అయ్యాయి. కానీ, ఇక్కడ ఒక్కరు కూడా డబ్బులు చెల్లించలేదు. అలాగే పెబ్బేరులో 7,261 రాగా.. 31 పరిష్కరించారు. ఆత్మకూర్‌లో 3,788 రాగా 168 పరిష్కారానికి నోచుకున్నాయి. వడ్డేపల్లిలో 1,930 రాగా, 255 పరిష్కారం చేశారు. అలంపూర్‌లో 425 రాగా 422 పరిష్కరించగా ఈ చోట్ల ఎవరూ చెల్లించలేదు.

మున్సిపాలిటీల వారీగా వివరాలు

అప్పట్లో ఎల్‌ఆర్‌ఎస్ కింద ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా మహబూబ్‌నగర్ మున్సిపాలిటీకి 31,144 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు కేవలం 2,211 మాత్రమే పరిష్కారానికి నోచుకున్నాయి. ఇందులో 129 మంది మాత్రమే రూ.67,52,678 చెల్లించారు.

- ❒ అచ్చంపేటలో 11,971 దరఖాస్తులు రాగా 434 పరిష్కరించారు. ఇక్కడ 92 మంది రూ.20,97,790 చెల్లించారు.
- ❒ గద్వాలలో 14,317 రాగా.. 1,244 పరిష్కారమయ్యాయి. కాగా 37 మంది మాత్రమే రూ.17,22,261 చెల్లించారు.
- ❒ కల్వకుర్తిలో 11,443 రాగా, 3,390 పరిష్కరించారు. ఇందులో 41 మంది రూ.11,54,244 చెల్లించారు.
- ❒ నారాయణపేటలో 6,962 దరఖాస్తులు రాగా.. 6,959 పరిష్కారం అయ్యాయి. 32 మంది మాత్రమే రూ.10,51,875 చెల్లించారు.
- ❒ జడ్చర్లలో 17,564 రాగా.. 235 పరిష్కారం అయ్యాయి. ఇందులో 16 మంది మాత్రమే రూ.8,27,834 చెల్లించారు.
- ❒ భూత్పూర్‌లో 5,999 దరఖాస్తులకుగాను 1,021 పరిష్కరించారు. ఇందులో 21 మంది మాత్రమే రూ.4,56,852 చెల్లించారు.
- ❒ వనపర్తిలో 28,941 రాగా.. 294 పరిష్కారమయ్యాయి. కాగా 21 మంది మాత్రమే రూ.3,88,435 చెల్లించారు.
- ❒ కొల్లాపూర్‌లో 4,565 రాగా, 417 పరిష్కరించారు. ఇందులో 17 మంది రూ.3,32,574 చెల్లించారు.
- ❒ నాగర్‌కర్నూల్‌లో 16,011 రాగా, 2,105 పరిష్కారమయ్యాయి. కాగా 12 మంది మాత్రమే రూ.2,95,627 చెల్లించారు.
- ❒ అమరచింతలో 438 రాగా 436 పరిష్కరించగా కేవలం నలుగురు మాత్రమే రూ.2,77,216 చెల్లించారు.
- ❒ అయిజలో 9,767 రాగా, 750 పరిష్కారం అయ్యాయి. ఇక్కడ తొమ్మిది మంది మాత్రమే రూ.1,93,592 చెల్లించారు.
- ❒ కోస్గిలో 3,909 రాగా 3,878 పరిష్కారం కాగా నలుగురు మాత్రమే రూ.97,849 చెల్లించారు.
- ❒ మక్తల్‌లో 10,498 రాగా 7,115 పరిష్కరించారు. కాగా ఒక్కరు మాత్రమే రూ.90,467 చెల్లించారు.

సద్వినియోగం చేసుకోవాలి..



ఎల్‌ఆర్‌ఎస్ కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఇచ్చిన అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఈ పథకం కోసం 2020 సెప్టెంబర్‌లో దరఖాస్తు చేసుకున్న వారు పూర్తి వివరాలతో టౌన్ ప్లానింగ్ అధికారులను సంప్రదించాలి. అన్నీ సక్రమంగా ఉంటే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం. అక్కడ అనుమతి లభించాక నిబంధనల మేరకు ఫీజు చెల్లించి ఓపెన్ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి.
– మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్

కమనీయం.. లక్ష్మీ నారసింహుడి కల్యాణం



లక్ష్మీ నారసింహస్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి



స్వామివారి కల్యాణం తిలకిస్తున్న భక్తులు

తాడూరు: మండలంలోని శిర్సవాడలో బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నారసింహస్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కల్యాణ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి.. వేద మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. అంతకుముందు ఆలయంలో సుదర్శన హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ రమేష్‌రెడ్డి, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మదనగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్ మదనగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ట్రస్టు చైర్మన్ రాజా ఆదిత్య లక్ష్మణరావు ఆధ్వర్యంలో ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తూ వస్తున్నారు. సురభి వంశస్తులు పరిపాలించిన దేవస్థానంగా మదనగోపాల స్వామి ఆలయానికి గుర్తింపు ఉంది. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకుడు ఆదిత్య శర్మ తెలిపారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ సీతారామారావు

కల్వకుర్తి టౌన్: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరించాలని అడిషనల్ కలెక్టర్ సీతారామారావు అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్వామితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ రైతుల నుంచి కొనుగోలుచేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. వర్షం వచ్చినప్పుడు ధాన్యం తడవకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం రైతులతో మాట్లాడి, సమస్యలను తెలుసుకున్నారు. కల్లాలలోనే ధాన్యాన్ని బాగా ఆరబెట్టిన తర్వాతే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. పీఏసీఎస్ అధికారులు కొనుగోలు కేంద్రాల వద్ద ఉండటమే కాకుండా, ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని అన్నారు. అడిషనల్ కలెక్టర్ వెంట తహసీల్దార్ ఇబ్రహీం ఉన్నారు.

క్లుప్తంగా

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి


కొములయ్య (ఫైల్)

గోపాల్‌పేట: ఉపాధి హామీ పనికి వెళ్లిన ఓ వ్యక్తి వడదెబ్బకు గురై మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని కేశంపేట గ్రామానికి చెందిన కొములయ్య(55) గ్రామ శివారులోని చెరువులో ఒండ్రుమట్టిని తీసేందుకు ఉపాధి కూలీ నిమిత్తం బుధవారం ఉదయం వెళ్లాడు. పని ముగిసిన తర్వాత ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను అడిగి అంబలి తాగాడు. కొద్ది సేపట్లోనే ఆరోగ్యం సహకరించడం లేదని కుటుంబ సభ్యులకు చెప్పగా ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కొములయ్యకు భార్యతోపాటు ముగ్గురు సంతానం ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం


రమేష్ (ఫైల్)

ఉండవెల్లి: మండలంలోని మారమునగాల-1లో మంగళవారం సాయంత్రం గొల్ల రమేష్ (30), గొల్ల నాగరాజు పొలానికి వెళ్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగిలి గొల్ల రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. గొల్ల నాగరాజుకు గాయాలవడంతో కర్నూల్ ఆస్పత్రికి తరలిచారు. రమేష్ భార్య సునిత ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

అచ్చంపేటలో మరో వ్యక్తి..

అచ్చంపేట రూరల్: విద్యుదాఘాతంతో ఓ కూలీ మృతి చెందిన ఘటన బుధవారం పట్టణంలోని వెంకటేశ్వరనగర్ కాలనీలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బల్మూర్ మండల కేంద్రానికి చెందిన ఆరెకంటి రాములు(40) కొన్ని రోజులుగా వెంకటేశ్వరనగర్ కాలనీలో కూలీ పనులు చేసుకుంటూ ఉంటున్నాడు. బుధవారం కాలనీలోని వేణుగోపాల్ ఇంటి వద్ద వేప కొమ్మలు కొట్టడానికి కూలీకి వెళ్లగా.. ప్రమాదవశాత్తు విద్యుత్‌వైర్లు తగిలి షాక్‌తో మృతి చెందాడు. మృతుడి భార్య కళమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ నాగేందర్ తెలిపారు.

నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి వ్యక్తి..

నాగర్‌కర్నూల్ క్రైం: నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి కిందపడి వ్యక్తి మృతిచెందిన ఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్లకు చెందిన మల్లేష్ (42) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తు జీవనం సాగిస్తున్నాడు. ఈయను హౌసింగ్‌బోర్డు కాలనీలో నిర్మాణంలో ఉన్న భవనంపై పిల్లర్లకు గోనె సంచులు కడుతుండగా ప్రమాదవశాత్తు జారీ కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

భార్యపై వేధింపులు: కేసు నమోదు

లింగాల: అదనపు కట్నం కావాలని భార్యను వేధింపులకు గురిచేయడంతో బుధవారం భర్తపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగాల మండలంలోని అంబట్‌పల్లికి చెందిన శివలీలకు తెలకపల్లి మండలం వట్టిపల్లికి చెందిన రాజుతో 11ఏళ్ల క్రితం వివాహమైంది. అదనపు కట్నం కావాలని కొంతకాలంగా అత్తారింటి వారు వేధింపులకు గురిచేస్తూ ఇబ్బందులకు గురి చేశారని పోలీసులు తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు.

ఆలూరు ఆర్‌యూబీలో నిలిచిన నీరు



జడ్చర్ల టౌన్: మండలంలోని ఆలూరు గేట్‌వద్ద ఆర్‌యూబీలో వర్షపునీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శనివారం, సోమవారం రెండురోజుల్లో కురిసిన భారీ వర్షానికి వరదనీరు ఆర్‌యూబీలో వచ్చి చేరింది. ఆర్‌యూబీ లెవల్ స్థాయిని దాటిని నీరు నిలవటంతో రెండురోజుల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. నేటికి 2అడుగుల నీరు ఆర్‌యూబీలో నిలిచి ఉండటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్‌యూబీ నుంచి నీటిని బయటకు పంపించే మోటార్లు పనిచేయకపోవటం వల్ల పరిస్థితి దాపురించిందని గ్రామస్తులు వాపోతున్నారు. రైల్వే అధికారులు స్పందించి ఆర్‌యూబీ నుంచి నీటిని బయటకు పంపించాలని డిమాండ్ చేస్తున్నారు. వర్షం వచ్చిన ప్రతిసారి ఇదే సమస్య నెలకొంటున్నా రైల్వే అధికారులు స్పందించటం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్రికెటర్లకు మహర్దశ

- ఎండీసీఏ మైదానంలో టర్ఫ్ వికెట్
- అంతర్జాతీయ ప్రమాణాలతో త్వరలో ఏర్పాటు
- భవిష్యత్‌లో రంజీ మ్యాచ్‌లకు అవకాశం


టర్ఫ్ వికెట్ ఏర్పాటు కానున్న జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానం

మహబూబ్‌నగర్ క్రీడలు: క్రికెట్‌లో టర్ఫ్ వికెట్ (పిచ్)కు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. కేవలం మ్యాట్‌లమీద క్రికెట్ ఆడే క్రీడాకారులకు టర్ఫ్ వికెట్‌పై ఆడాలంటే మెరుగైన ప్రాక్టీస్ ఉండాల్సిందే. జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో టర్ఫ్ వికెట్ లేకపోవడంతో బయట జరిగే టోర్నీల్లో మెరుగైన ఆటతీరును కనబర్చడానికి క్రీడాకారులు ఇబ్బందులు పడేవారు.

త్వరలో ఏర్పాటు

జిల్లా కేంద్రం పిల్లలమర్రి సమీపంలోని క్రికెట్ మైదానంలో ఎండీసీఏ ఆధ్వర్యంలో క్రీడాకారుల సౌకర్యార్థం ఎన్నో వసతులు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలోనే హైదరాబాద్ తర్వాత హెచ్‌సీఏకు ఉన్న ఏకైక క్రీడా మైదానం ఇది. ఇక్కడి మైదానంలో ఇప్పటికే క్రీడాకారుల ప్రాక్టీస్ కోసం నెట్, రెండు బౌలింగ్ మిషన్లు ఏర్పాటు చేశారు. కొత్త పెవిలియన్ భవనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి జిల్లా కేంద్రంలోని క్రికెట్ మైదానంలో టర్ఫ్ వికెట్ ఏర్పాటు చేయాలనే ఇటు క్రీడాకారులు, అటు అసోసియేషన్ సభ్యుల కల నెరవేరనుంది. ఔత్సాహిక ఉమ్మడి జిల్లా క్రికెట్ క్రీడాకారులకు మహర్దశ కలగనుంది. గత నెలలో ఎండీసీఏ మైదానంలో వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో పలువురు హెచ్‌సీఏ ప్రతినిధులు పాల్గొన్నారు. మైదానంలో టర్ఫ్ వికెట్ ఏర్పాటు కోసం ఎండీసీఏ ప్రతినిధులు వారి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రతినిధులు హెచ్‌సీఏకు వివరించగా మార్గం సుగమం ఏర్పడింది. త్వరలో ఎండీసీఏ మైదానంలో జిల్లా క్రికెట్ క్రీడాకారులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన టర్ఫ్ వికెట్ అందుబాటులోకి రానుంది.

టర్ఫ్ వికెట్‌తో మెరుగైన ఆటతీరు

టర్ఫ్ వికెట్‌పైనే జాతీయ, అంతర్జాతీయస్థాయిలో మ్యాచ్‌లు ఆడుతారు. ఇంతకాలం మ్యాట్‌పై ఆడే జిల్లా క్రీడాకారులు టర్ఫ్ వికెట్ అందుబాటులోకి వస్తే వారి ఆటతీరు మరింత మెరుగు పడే అవకాశం ఏర్పడుతుంది. హెచ్‌సీఏ రాష్ట్రస్థాయి టోర్నీల్లో జిల్లా క్రీడాకారులు మరింతగా రాణించవచ్చు. రంజీస్థాయిలో ఆడేలా జిల్లా క్రీడాకారులను తీర్చిదిద్దవచ్చు. ఎండీసీఏ మైదానంలో టర్ఫ్ వికెట్ ఏర్పాటైతే భవిష్యత్‌లో హెచ్‌సీఏ రాష్ట్రస్థాయి మ్యాచ్‌లతోపాటు రంజీ మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది.

ఏళ్ల కల నెరవేరనుంది



ఎండీసీఏ మైదానంలో టర్ఫ్ వికెట్ ఏర్పాటు చేయాలనే కల త్వరలో నెరవేరబోతున్నందుకు సంతోషంగా ఉంది. దీని గురించి గతంలోని హెచ్‌సీఏ కార్యవర్గానికి దృష్టికి తీసుకెళ్లినా స్పందించ లేదు. ఇప్పటి కార్యవర్గం ఎండీసీఏ మైదానంలో ఏర్పాటుపై హామీ ఇచ్చారు. త్వరలో ఏర్పాటు చేసేలా హెచ్‌సీఏ కార్యవర్గం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. టర్ఫ్ వికెట్ ఏర్పాటేయితే జిల్లా క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడుతుంది.

– ఎం.రాజశేఖర్, ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి

అయినవాళ్లు సహకరిస్తలేరని..

తల్లీకూతురి బలవన్మరణం

- పురుగు మందు తాగేందుకు భయపడి వెనకడుగు వేసిన తండ్రి
- ఏబూడిదపాడులో విషాదఛాయలు


వరలక్ష్మి, అనురాధ (ఫైల్)

శాంతినగర్: వారసత్వ భూమి విక్రయించగా వచ్చిన డబ్బుల్లో వాటా ఇచ్చి.. తమ బిడ్డ పెళ్లి, కుమారుడి చదువుకు సహకరించాలని అయినవాళ్లను ప్రాధేయపడినా పట్టించుకోకపోవడంతో ఓ కుటుంబం తీవ్ర మనస్తాపానికి గురైంది. కూతురితో సహా భార్యాభర్తలిద్దరూ ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధపడ్డారు. మొదట తల్లీకూతురు పురుగు మందు తాగగా.. తండ్రి భయపడి మిన్నంకుండిపోయాడు. విషయం తెలుసుకున్న స్థానికులు తల్లీకూతురిని ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలోనే కన్నుమూసిన విషాదకర ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం ఏ బూడిదపాడు గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. ఏ బూడిదపాడుకు చెందిన మాల హరన్నకు నలుగురు కుమారులు ఉండగా.. ఎకరా పట్టా పొలం, 30 గుంటల అసైన్డ్ (సీలింగ్) పొలాన్ని అన్నదమ్ముళ్లకు పంచారు. పట్టా పొలం రెండవ, మూడవ కుమారుడికి పంపకాల్లో రాగా.. పెద్ద కుమారుడైన నర్సింహులు, చిన్న కుమారుడికి 30 గుంటల సీలింగ్ భూమి వచ్చింది. కొన్నేళ్ల కిందట ఇద్దరు అన్నదమ్ములు పట్టా పొలాన్ని అమ్ముకున్నారు. సీలింగ్ పొలాన్ని ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో నర్సింహులు కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. కూతురి పెళ్లి, కుమారుడి చదువు వారికి భారంగా మారింది. ఈక్రమంలో ఆర్థిక ఇబ్బందులు తోడయ్యాయి. దీంతో అమ్మిన పట్టా పొలం డబ్బులను అందరికీ సమానంగా పంచాలని అన్నదమ్ముళ్లతో గొడవ పెట్టుకోవడంతోపాటు పెద్దలను ఆశ్రయించారు. తన బిడ్డ పెళ్లి, కుమారుడి చదువు కోసం డబ్బులు అవసరమని.. పట్టా పొలంలో తనకూ వాటా ఇవ్వాలని ప్రాధేయపడినా ఫలితం లేకపోయింది. దీంతో నర్సింహులు, అతడి భార్య వరలక్ష్మి (39), కూతురు అనురాధ(18) పురుగు మందు తాగి, చనిపోవాలని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో మొదట వరలక్ష్మి, ఆమె కూతురు పురుగు మందు తాగారు. నరసింహులు పురుగుల మందు తాగడానికి భయపడి విరమించుకున్నాడు. విషయం తెలుసుకున్న స్థానికులు.. తల్లీకూతురిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కళ్ల ముందే భార్య, కూతురు చనిపోవడంతో నర్సింహులు కుప్పకూలిపోయాడు. తల్లీ కూతురి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు శాంతినగర్ ఏఎస్‌ఐ అయ్యన్న తెలిపారు. గ్రామంలో ఎలాంటి గొడవలు జరగకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

కనుల పండువగా ప్రభోత్సవం

ఎర్రవల్లిచౌరస్తా: మండలంలోని బీచుపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజు బుధవారం ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం, ఉపనయనం, పల్లకీసేవ తదితర పూజలు నిర్వహించారు. రాత్రి ప్రభోత్సవం (చిన్న తేరు) కనులపండువగా సాగింది. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈఓ రామన్‌గౌడ్, పాలక మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న అర్చకుడు


చిన్నతేరు లాగుతున్న భక్తులు

ఉమామహేశ్వరంలో ప్రత్యేక పూజలు

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో బుధవారం శ్రీశైల దేవస్థాన పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిప్రదక్షిణ, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారి సహస్రనామ కుంకుమార్చన వంటి పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్‌ను పూజారులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న శ్రీశైల దేవస్థానం పూజారులు

సేంద్రియ ఎరువు తయారీలో జాప్యమెందుకు?


అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ రవీందర్‌రావు

- రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ రవీందర్‌రావు

బాలానగర్: సెగ్రిగేషన్ షెడ్లు వినియోగంలోకి తీసుకురావడంలో అలసత్వం ఎందుకు ప్రదర్శిస్తున్నారని.. సేంద్రియ ఎరువు తయారీలో జాప్యమెందుకని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ రవీందర్‌రావు అధికారులను ప్రశ్నించారు. బుధవారం మండలంలోని మోదంపల్లి, అప్పాజిపల్లి, పలుగుమీదితండా, పెద్దరేవల్లిలో పర్యటించి ఉపాధి పనులు, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని, వేసవి దృష్ట్యా పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని, ఇళ్ల నుంచి వేర్వేరుగా సేకరించాలని సూచించారు. దీంతో గ్రామాలు స్వచ్ఛంగా మారడమేగాక గ్రామపంచాయతీలు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని వివరించారు. సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా నిరుపయోగంగా ఉన్నాయని.. వినియోగంలోకి తీసుకురావాలని మండల అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీఆర్డీఓ నర్సింహులు, డీపీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ విజయకుమారి, ఏపీఓ రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వివాదాస్పదంగా మారిన విగ్రహ తొలగింపు

గట్టు: మండలంలోని గొర్లఖాన్‌దొడ్డిలో విగ్రహ తొలగింపు వ్యవహారం వివాదాస్పదంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఓ సామాజిక వర్గానికి చెందిన వారు గ్రామంలోని వాటర్ ట్యాంకు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు తీసుకొచ్చారు. పక్కనే ఉన్న మరో వర్గం వారు ఇందుకు అభ్యంతరం వ్యక్తం చేశారు. అదేక్రమంలో విగ్రహాన్ని తొలగిస్తున్న ఘటనల వీడియోలు బుధవారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో వివాదాస్పదంగా మారింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రామకృష్ణ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలతో మాట్లాడి తాత్కాలికంగా సద్దుమణిగేలా చేశారు. ఈ ఘటనకు సంబంధించి రెండు వర్గాలకు చెందిన ఆరుగురిని బుధవారం సాయంత్రం తహసీల్దార్ సరితారాణి ఎదుట బైండోవర్ చేశారు. వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించుకోవాలని.. లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

హైవేపై మూడు వాహనాలు ఢీ

- ఆరుగురికి గాయాలు

కల్వకుర్తిరూరల్: హైదరాబాద్, శ్రీశైలం జాతీయ ప్రధాన రహదారిపై కల్వకుర్తి తాండ్ర సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన ఇలా ఉన్నాయి. కల్వకుర్తి నుంచి దేవరకొండ వైపు వెళ్తున్న బొలెరో వాహనం, దేవరకొండ నుంచి కల్వకుర్తి వైపు వస్తున్న డీసీఎం ఢీకొన్నాయి. అదే సమయంలో చారకొండ నుంచి కల్వకుర్తి వైపు వస్తున్న ఆటో డీసీఎంను ఢీకొంది. బొలెరో నడుపుతున్న ఆంజనేయులు చేయి విరిగా తీవ్రంగా గాయపడ్డాడు. చారకొండ మండలం తురుకలపల్లికి చెందిన తల్లి, ఇద్దరు కుమారులకు తీవ్ర గాయాలు అయ్యాయి. బొలెరో వాహనంలో ప్రయాణిస్తున్న ముగ్గురు, ఆటోలో ప్రయాణిస్తున్న మరో ముగ్గురికి గాయాలు కావడంతో వారందరిని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై విచారణ చేసి చర్యలు చేపడుతామని ఏఎస్‌ఐ శ్రీనివాస్ చెప్పారు.


దెబ్బతిన్న బొలెరో వాహనం

ఆకట్టుకున్న స్నేక్ షో

- మయూరి పార్క్‌లో 8 రకాల పాములతో ప్రదర్శన


చిన్నారులతో పాముల ప్రదర్శన చేస్తున్న సదాశివయ్య

పాలమూరు: అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం మయూరి పార్క్‌లో ప్రత్యేక స్నేక్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్చర్ల డిగ్రీ కళాశాల అధ్యాపకుడు సదాశివయ్య మొత్తం 8 రకాల పాములతో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించి సందర్శకులను ఆకర్షించారు. ప్రధానంగా వేదికపై చిన్నారులకు దగ్గరి నుంచి షో చేసి చూపించారు. పాముల జాతులు.. వాటి విశిష్టను వివరించారు. కార్యక్రమంలో రేంజ్ ఆఫీసర్ చంద్రయ్య, సిబ్బంది రాజశేఖర్, కురుమతి, అనిత పాల్గొన్నారు.

తగ్గిన సీజన్.. ఉల్లికి డిమాండ్


దేవరకద్ర మార్కెట్‌కు వచ్చిన ఉల్లి

దేవరకద్ర: ఉల్లి సీజన్ తగ్గిన తర్వాత ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. కొనుగోలు దారులు ఎక్కువ కావడం మార్కెట్ తెచ్చేవారు తక్కువ కావడంతో ఉల్లి ధరలు పెరుగుతున్నాయి. మూడు వారాల క్రితం వరకు రూ.1,600 దాటని ధర ఆ తర్వాత.. ఒక్కసారిగా రూ.వెయ్యి నుంచి 1,200 వరకు పెరిగి రూ.2800 చేరాయి. ఈ ఏడాది జనవరి నుంచి నాలుగు నెలలపాటు ఉల్లి సీజన్ జోరుగా సాగింది. కానీ, ధరలు మాత్రం నిలకడగానే ఉన్నాయి. ఏప్రిల్ వరకు వినియోగదారులు పెద్దఎత్తున ఉల్లిని కొన్నారు. అయితే ఉగాది తర్వాత ఉల్లి నిల్వ చేయడానికి వీలుంటుందనే ఉద్దేశంతో చాలామంది ఉల్లిని కొనకుండా వేచి ఉన్నారు. వారంతా ఒక్కసారిగా ఉల్లి కోసం మార్కెట్‌కు రావడంతో డిమాండ్ పెరిగింది. అయితే ఉల్లి కోతలు పూర్తయ్యి దిగుబడులు తగ్గడంతో మార్కెట్‌కు తక్కువగా అమ్మకానికి వస్తుంది. దీంతో కొనుగోలుదారుల తాకిడి పెరగడంతో వచ్చిన ఉల్లి సరిపోవడం లేదు. సీజన్ మొదట్లో కొనేవారు లేక ఎదురుచూసిన రైతులకు ఇప్పుడు ఉల్లి తెస్తే ఎగబడి కొంటున్నారు. కొందరు రైతులు బుధవారం ఉదయమే ట్రాక్టర్లపై ఉల్లి బస్తాలు తెచ్చి మార్కెట్ బయటే అమ్ముకోగా.. మరి కొందరు మార్కెట్‌లో వేలానికి పెట్టి విక్రయించారు.

45 కిలోల బస్తా ధర రూ.1,300

దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం నేరుగా ఉల్లి విక్రయాలు సాగాయి. కొందరు రైతులు మాత్రమే ఉల్లిని అమ్మకానికి తేవడంతో వేలం లేకుండానే వ్యాపారులు ధర నిర్ణయించి ఉల్లిని కొనుగోలు చేశారు. క్వింటాల్ ఉల్లి గరిష్టంగా రూ.2,600, కనిష్టంగా రూ.2,200 వరకు విక్రయించారు. అలాగే 45 కిలోల బస్తా ధర గరిష్టంగా రూ.1,300, కనిష్టంగా రూ.1,100 అమ్మకాలు సాగించారు. మార్కెట్‌కు వచ్చిన ఉల్లి మధ్యాహ్నం వరకే అమ్మకాలు పూర్తయ్యాయి. మార్కెట్‌కు దాదాపు 500 బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది.

సోనామసూరి ధర రూ.2,419

మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన టెండర్లలో సోనామసూరి ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,419, కనిష్టంగా రూ.2,373 ధరలు లభించాయి. సీజన్ తగ్గడంతో మార్కెట్‌కు వంద బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

జాతీయ రహదారిపై ట్రాఫిక్‌జాం


జాతీయ రహదారిపై ట్రాఫిక్ జాంతో నిలిచిన వాహనాలు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం ట్రాఫిక్ జాం ఏర్పడింది. కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్లే రోడ్డులో కొండేరు స్టేజీ నుంచి ఎర్రవల్లి కూడలి వరకు రహదారిపై కొత్తగా ప్యాచ్ వర్క్‌ను చేపడుతుండడంతో హైవే అధికారులు ఒకే రోడ్డుపై ఇరువైపుల వాహనాలు పోయేందుకు ట్రాఫిక్ డైవర్షన్ చేశారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై ఎర్రవల్లి కూడలి నుంచి ఇరువైపుల మార్గాల్లో దాదాపు 4కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ జాం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రోడ్డు మరమ్మతు వల్ల నిత్యం ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదని వాపోయారు. అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని వాహనాదారులు కోరుతున్నారు.

పోలీస్ వాహనం ఎక్కడ?

- నిందితులను వెంటాడుతుండగా బోల్తా..
- మరమ్మతు కోసం పక్క రాష్ట్రానికి తరలింపు
- ఆలస్యంగా వెలుగులోకి..

గద్వాల క్రైం: రేషన్ బియ్యం అక్రమంగా సరిహద్దు దాటిపోతున్నట్లు పక్కా సమాచారం మేరకు పోలీసులు గుర్తించారు. వాహనం సరిహద్దు దాటుతుందనే గుర్తించిన పోలీసు సిబ్బంది ఆ వాహనాన్ని పట్టుకునేందుకు పోలీసు వాహనం దూసుకెళ్లింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలో చోటు చేసుకుంది. ఈ ఘటన 15 రోజుల క్రితం జరిగినట్లు సమాచారం. కాగా జిల్లాలోని కేటీదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో వాహనం కనిపించకపోవడంతో స్థానికంగా కలకలం రేపింది. నిత్యం గస్తీ తిరిగే పోలీస్ వాహనాలలో ఒక వాహ నం కొద్ది రోజుల నుంచి ఎక్కడా కనిపించకపోవడంతో జిల్లాలో విషయం చర్చనీయాంశంగా మా రింది. అత్యవసర పరిస్థితుల్లో వృత్తిలో ఎంతగానో సహకరించేవి. పోలీస్ వాహనాలు విలువైన ఆస్తిగా భావిస్తారు. కొద్ది రోజుల క్రితం వాహనానికి ప్రమా దం జరిగిందని, ఉన్నతాధికారులకు తెలియకుండా గుర్తుతెలియని ప్రాంతంలో మరమ్మతు చేయిస్తున్నట్లు పోలీసు సిబ్బంది గుసగుసలాడుతున్న విష యం బయటకు పొక్కింది. పెద్ద మొత్తంలో వాహ నం దెబ్బతిన్నట్లు వినికిడి. ఈ సమయంలో ఎస్‌ఐ, డ్రైవర్ ఇద్దరే వాహనంలో ఉన్నట్లు తెలిసింది. వారి ఇద్దరికి ఎలాంటి ప్రమాదం కాలేదు. ఈ వాహనానికి ఇన్సూరెన్స్ ఉంటే వారే భరిస్తారని, ఎందుకు వెళ్లడం లేదని అనుమానం ఉంది. ఈ వాహనం మరమ్మతు ఖర్చు రేషన్ బియ్యం, ఇసుక, మట్టి మాఫియా చేయిస్తామని హామీఇచ్చారని తెలిసింది. మరమ్మతుకు పక్క రాష్ట్రానికి తరలించినట్లు సమాచారం. దీనిపై కేటీదొడ్డి ఎస్‌ఐ శ్రీనివాస్‌రావును 'సాక్షి' వివరణ కోరగా.. అలాంటిదేమి లేదని, వాహనం హెడ్ క్వార్టర్స్‌లో ఉందని వెల్లడించారు. కాగా అక్కడికి వెళ్లి పరిశీలిస్తే వాహనం కనిపించలేదు. పోలీస్‌వాహనం మాయమవడంపై జిల్లా లో పలు రకాలుగా చర్చించుకుంటున్నారు.